కర్రలే ఆధారం.. ప్రాణాలే పణం



పట్టణంలోని సుంకులమ్మ గుడి సమీపంలోని భవనానికి ఓ కంపెనీ ప్రకటనను పెయింటర్లు ప్రాణాలను పణంగా పెట్టి రాశారు. ఎలాంటి భద్రతా లేకుండా వెదురు బొంగులను తాళ్లతో కట్టి వాటిపై ఎత్తులో నిలబడి ఎలాంటి భద్రతా, రక్షణ చర్యలు తీసుకోకుండా పెయింటింగ్ వేశారు. పనులు త్వరగా పూర్తి చేయాలని.. భద్రతను విస్మరించడంపై పలువురు విమర్శించారు.

- న్యూస్‌టుడే, పెబ్బేరు పట్టణం

వేడుకగా రాఘవేంద్రుడి రథోత్సవం

కొత్తకోట గ్రామీణం, న్యూస్‌టుడే : గురురాఘవేంద్ర స్వామి ఆరాధనోత్సవాల్లో భాగంగా ఆదివారం స్వామివారికి ప్రత్యేక పూజలు నిర్వహించినట్లు అర్చకులు జయతీర్థాచార్యులు, భీమాచారి, తిరుమలాచార్యులు తెలిపారు. విద్యాధీశతీర్థ శ్రీపాదుల, విద్యారాజేశ్వర తీర్థ శ్రీపాదుల ఆధ్వర్యంలో ఉడిపి పలిమారుమఠం నిర్వాహకులు అభిషేకం, అర్చన చేశారు. అనంతరం రథోత్సవాన్ని వేడుకగా నిర్వహించారు. ఆలయ నిర్వాహకులు భక్తులకు అన్నదానం చేశారు. మాజీ ఎమ్మెల్యే రావుల రవీంద్రనాథ్‌రెడ్డి, అర్చకులు ప్రవీణ్‌కుమార్, భక్తులు పాల్గొన్నారు.



రథోత్సవంలో రావుల రవీంద్రనాథ్ రెడ్డి, తదితరులు

ఈ నామ్‌లో సాంకేతిక లోపం

వనపర్తి, న్యూస్‌టుడే : రైతులు పండించిన పంటను మంచి ధరకు విక్రయించేందుకు కేంద్ర ప్రభుత్వం అమలులోకి తెచ్చిన ఈ నామ్ (నేషనల్ అగ్రికల్చర్ మార్కెట్) 2.0లో ఏర్పడిన సాంకేతిక సమస్య వల్ల ఇబ్బందులు ఎదురవుతున్నాయి. రాష్ట్ర ప్రభుత్వం కేంద్రం దృష్టికి తీసుకెళ్లినా పరిష్కారం లభించడం లేదు. ఈ నామ్ 2.0 సాఫ్ట్‌వేర్‌ను నవీకరించినా అప్‌డేట్ కాకపోవడంతో అన్నదాతలు ఆర్థికంగా నష్టపోతున్నారు.



వనపర్తి మార్కెట్‌యార్డులోని కార్యాలయం

● 2016 నుంచి ఈనామ్ విధానం అమలులోకి వచ్చింది. వనపర్తి మార్కెట్‌లో 44 మంది కమీషన్ ఏజెంట్లు, 62 మంది ఖరీదుదారులున్నారు. కొనుగోలు కోసం రైతులు తీసుకొచ్చిన ధాన్యాన్ని ఆన్‌లైన్‌లో రైతు, తండ్రి పేరు, గ్రామం, ఎన్ని బస్తాలు, చరవాణి నంబరును నమోదు చేస్తారు. మార్కెట్‌కు వచ్చిన ధాన్యాన్ని పరిశీలించిన అనంతరం ఖరీదుదారులు వేసిన ధరలను కోట్ చేస్తారు. వివరాలను సిబ్బంది చూడగా రైతు పేరు, వివరాలు కనిపించడం లేదు. రెండు, మూడు గంటల పాటు ఎదురు చూడాల్సి వస్తోంది. ఈ విషయమై యార్డు కార్యదర్శి శివరాజ్‌ను 'న్యూస్‌టుడే' వివరణ కోరగా సాఫ్ట్‌వేర్ ప్రారంభంలో సాంకేతిక సమస్య ఏర్పడిన మాట వాస్తవమేని, ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లామని, రైతులకు ఇబ్బందులు లేకుండా సమస్య పరిష్కరిస్తున్నామని పేర్కొన్నారు.

సీఎంఆర్ ఎగవేత.. భారీగా మేత


- టాప్ 20లో జిల్లా మిల్లులు!
- రంగంలోకి దిగిన ఈడీ

పెబ్బేరు, న్యూస్‌టుడే : ప్రభుత్వం నుంచి తీసుకొన్న ధాన్యంలో బియ్యం రూపకంగా (సీఎంఆర్) తిరిగి ఇచ్చే విషయంలో జిల్లా మిల్లర్ల యజమానులు రాష్ట్ర స్థాయిలో భారీ ఎగవేతదారుల జాబితాలో (టాప్ 20లో) చోటు దక్కించుకోవడం సంచలనంగా మారింది. పౌరసరఫరాల శాఖ అధికారుల హెచ్చరికలను ఏమాత్రం లెక్క చేయని వీరిపై కేంద్ర దర్యాప్తు సంస్థ ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్ (ఈడీ) కన్ను పడింది. జిల్లాలోని మూడు ప్రధాన బియ్యం మిల్లులకు నోటీసులు జారీ చేసినట్లు జిల్లాలో చర్చనీయాంశమైంది.

రూ.470 కోట్లలో.. రూ.40 కోట్లు రికవరీ..: 2022-2023 యాసంగికి సంబంధించిన టెండర్ ధాన్యంలో జిల్లాలోని బియ్యం మిల్లర్లు రూ.470 కోట్ల విలువ గల ధాన్యం ప్రభుత్వం నుంచి తీసుకున్నారు. బాగాలేదని చెబుతూ.. కేటాయించిన ధాన్యాన్ని రాష్ట్ర సరిహద్దులు దాటించారు.

● ప్రభుత్వానికి భారీగా చెల్లించాల్సిన వాటిలో మూడు బియ్యం మిల్లులు ఉన్నట్లు పౌరసరఫరాల శాఖ అధికారి ఆంజనేయులు తెలిపారు. కొత్తకోట మండలం మహాలక్ష్మి ఇండస్ట్రీస్ రూ.34 కోట్లు, వనపర్తి మండలం రిలిక్ బియ్యం మిల్లు నుంచి రూ.31 కోట్లు, శ్రీరంగాపూర్ మండలంలోని అల్ అజీజ్ బియ్యం మిల్లు రూ.31 కోట్లు చెల్లించాల్సి ఉందని పేర్కొన్నారు. ● టెండర్ ధాన్యం 110 బియ్యం మిల్లులకు కేటాయించగా.. 18 మిల్లులు పూర్తిగా చెల్లించినట్లు అధికారులు తెలిపారు. ఇంకా 92 మిల్లులు చెల్లించాల్సి ఉంది.

● 2022- 2023 యాసంగి సీజన్‌కు చెందిన ధాన్యంలో జిల్లాలోని వివిధ మండలాలకు చెందిన నాలుగు బియ్యం మిల్లులు 50 శాతం చెల్లించారు. వీటిలో సప్తగిరి, లక్ష్మీనర్సింహ, సింధు, శిర్డీ సాయి బియ్యం మిల్లులు 50 శాతం నగదును చెల్లించినట్లు అధికారులు తెలిపారు. మిగతావి 20 శాతం నుంచి 30 శాతం వరకు చెల్లించారు. రూ.470 కోట్లలో రూ.40 కోట్లు చెల్లించగా.. రూ.430 కోట్లు బకాయి ఉన్నట్లు అధికారులు వెల్లడించారు.



నిఘా

కొరవడిన పర్యవేక్షణ..: గడువు ముగిసినా.. సీఎంఆర్ చెల్లించని మిల్లులకు మళ్లీ ఎందుకు ధాన్యం కేటాయించారనేది ప్రశ్నార్థకంగా మారింది. కొల్లగొట్టిన ప్రజాధనాన్ని రికవరీ చేయడంలో.. బినామీ ఆస్తులను ప్రభుత్వం జప్తు చేయడంలో పౌరసరఫరాల శాఖ అధికారుల నిర్లక్ష్యంపై అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. గతంలో పని చేసిన వారు యజమానులకు పూర్తి స్థాయిలో సహకరించారనే ఆరోపణలు ఉన్నాయి. ఈడీ నేరుగా రంగంలోకి దిగి సోదాలు నిర్వహించి అక్రమార్కుల ఆస్తులను అటాచ్ చేసుకునే విధంగా ఉన్నట్లు స్పష్టంగా కనిపిస్తోంది.

వారంలో రూ.వంద కోట్లు వసూలు చేస్తాం..: బియ్యం మిల్లుల యజమానులకు ప్రభుత్వం అవకాశం కల్పించినా.. వారు సద్వినియోగం చేసుకోలేదు. వారం రోజుల్లో రూ.వంద కోట్లు రికవరీ చేస్తాం. ప్రతి ఒక్క మిల్లు నుంచి వసూలు చేస్తాం. ఉన్న బకాయిల్లో సోమవారం లోగా చెల్లిస్తే 50 శాతం, సెప్టెంబరు చివరి నాటికి చెల్లిస్తే 75 శాతం, అక్టోబరు చివరి నాటికి చెల్లిస్తే వంద శాతం చెల్లించాలనే ఆదేశాలు ఉన్నాయి. యజమానులు ఏ అవకాశం కోరుకుంటే అదే కల్పిస్తాం. **- ఆంజనేయులు, జిల్లా పౌరసరఫరాల శాఖ అధికారి**

నేడు ఆర్టీసీ డీఎంతో

ఈనాడు ఫోన్ ఇన్

వనపర్తి పట్టణం, న్యూస్‌టుడే: వనపర్తి డిపో పరిధిలో ప్రయాణికులు ఎదుర్కొంటున్న సమస్యలను నేరుగా ఆర్టీసీ డీఎం దేవేందర్‌గౌడ్ దృష్టికి తీసుకురావొచ్చు. ఆయనతో సోమవారం 'ఈనాడు' ఫోన్‌ఇన్ కార్యక్రమం నిర్వహిస్తోంది. బస్సు సౌకర్యం లేని గ్రామాల ప్రజలు, ప్రయాణ ప్రాంగణాల్లో నెలకొన్న సమస్యలు, వేళకు రాని బస్సుల గురించి తదితర సమస్యలు ఆయన దృష్టికి తేవచ్చు.

సమయం : ఉదయం 11 నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు
ఫోన్ నంబర్ : 99592 26289



ఆధ్యాత్మికం వైపు యువత దృష్టి

అలంపూర్, న్యూస్‌టుడే: యువత ఆధ్యాత్మికం వైపు దృష్టి పెట్టారని, ఎక్కడ చూసినా ఆలయాల్లో యువత సందడే కనిపిస్తోందని కేంద్ర బొగ్గు, గనుల శాఖ మంత్రి కిషన్‌రెడ్డి అన్నారు. ఆదివారం అలంపూర్ ఆలయాల వద్ద రూ.4.60 కోట్లతో చేపట్టిన మల్టీమీడియా, సౌండ్ లైట్స్ షోను ఎంపీలు మల్లు రవి, డీకే అరుణ, స్థానిక ఎమ్మెల్యే విజయుడుతో కలిసి ఆయన ప్రారంభించి మాట్లాడారు. అలంపూర్ ఆలయాల అభివృద్ధిపై ఇప్పటికే చాలా నిర్లక్ష్యం జరిగిందని, రాబోయే రోజుల్లో అభివృద్ధికి అందరి సహాయ సహకారాలు ఉండాలని కోరారు. ఎంపీలు అరుణ, మల్లు రవి మాట్లాడుతూ.. అలంపూర్ ఆలయాల అభివృద్ధికి తమ వంతు కృషి చేస్తామన్నారు. రోడ్ల కోసం రూ.300 కోట్ల మేరకు డీపీఆర్ పంపించినట్లు మల్లు రవి పేర్కొన్నారు. రోజూ రాత్రి 7 గంటలకు తిరిగి 7.45 గంటలకు రెండు పర్యాయాలు 25 నిమిషాల చొప్పున లేజర్ షో ఉంటుందని అధికారులు వెల్లడించారు.





లేజర్ షోరూమ్ ప్రారంభిస్తున్న కేంద్ర మంత్రి, ఎంపీలు, ఎమ్మెల్యే.. అలరించిన ప్రదర్శన



అంధకారంలో వీధులు.. అలంకారంగా దీపాలు



వనపర్తి 11వ వార్డు కొత్తకోట రోడ్డులో వెలగని వీధి దీపం

న్యూస్‌టుడే పరిశీలన

వనపర్తి, న్యూస్‌టుడే : పట్టణాల్లోని పలు వీధుల్లో, ప్రధాన రహదారుల్లో వీధి దీపాలు వెలగక అంధకారం నెలకొంది. వీటి నిర్వహణను పట్టించుకోక పోవడంతో ప్రజలు చీకట్లో రాకపోకలు సాగించాల్సి వస్తోంది. టెండరును దక్కించుకున్న గుత్తేదారు రెండేళ్ల పాటు నిర్వహణ చూసుకోవాలి. అతను తన బాధ్యతను విస్మరించారు. దీపాలు వెలగడం లేదని ఆయా కాలనీల ప్రజలు, కౌన్సిలర్ల నుంచి ఒత్తిడి రావడంతో పుర విద్యుత్తు సిబ్బంది మరమ్మతులు చేసి చేతివాటం ప్రదర్శిస్తున్నారనే ఆరోపణలు ఉన్నాయి. ● వనపర్తిలో 33 వార్డులున్నాయి. 9,375 వీధి దీపాలు, సెంట్రల్ లైటింగ్ 525, ఆకాశదీపాలు 250 ఉన్నాయి. దీపాల కొనుగోలుకు గత పాలక వర్గం రూ.10 లక్షలు, ఎమ్మెల్యే మేఘారెడ్డి, ఉన్నతాధికారుల ఆదేశం మేరకు పంచాయతీరాజ్ శాఖ అధికారులు రూ.60 లక్షలతో 900 దీపాలను కొనుగోలు చేసి స్తంభాలకు అమర్చారు. పట్టణంలో ఆయా కాలనీల్లో 700కు పైగా వెలగడం లేదు. పట్టణంలో కొత్తగా ఏర్పడిన కాలనీల్లో 575 స్తంభాలకు పుర సిబ్బంది ఏర్పాటు చేయలేదు. నెలలో సుమారు 200 పైగా కాలిపోతున్నాయి. ● వనపర్తి 11వ వార్డులోని భారత్ కార్యాలయ సమీపంలో అయిదు స్తంభాల్లో నాలిగింట దీపాలు వెలగడం లేదు. 12, 15, 19, 24, 5, 3, 4 వార్డుల్లో 150కి పైగా దీపాలు వెలగక అంధకారం నెలకొంది.

● అమరచింత బీసీ, జోగిని కాలనీ, కొత్త తండా, పాత ఎస్సీ కాలనీతో పాటు పలు కాలనీల్లో 105కు పైగా, ఆత్మకూరులోని ఇందిరా కాలనీ, భార్గవి కాలనీ, బీసీ కాలనీ, ఎంవీ రామన్ స్కూల్ రోడ్డు తదితర కాలనీల్లో వందకు పైగా దీపాలు వెలగడం లేదు. కొత్తకోటలో 45, పెబ్బేరులోని 100కు పైగా స్తంభాలకు వీధి దీపాలు లేవు.

పట్టణం	వీధి దీపాలు	వెలగనివి
కొత్తకోట	2,500	45
వనపర్తి	9,735	770
పెబ్బేరు	2,672	105
ఆత్మకూరు	2,400	110
అమరచింత	1,150	150

నిర్వహణకు రూ.10 లక్షలు కేటాయించాం..: 'కాలిపోయిన దీపాల గురించి పీఆర్ శాఖ అధికారులతో పాటు గుత్తేదారుడి దృష్టికి తీసుకెళ్లినా వారు స్పందించడం లేదు. ఈ విషయాన్ని ఉన్నతాధికారులకు చెప్పాం. కొన్నింటిని సిబ్బంది మరమ్మతులు చేసి వెలిగేలా చూస్తున్నారు. వాటి నిర్వహణ కోసం పుర సమావేశంలో రూ.10 లక్షలు కేటాయించాం. మరమ్మతుల కోసం టెండర్లు పిలిచాం. **- మేఘనాథ్‌గౌడ్, పుర ఏఈ, వనపర్తి**



అక్రమాలకు ఆదివరం

ఈనాడు, మహబూబ్‌నగర్: యంత్రాంగానికి సెలవు రోజైన ఆదివారం అక్రమార్కులు చెలరేగిపోతున్నారు. అందినకాడికి దోచుకునేందుకు సిద్ధమవుతున్నారు.. ఇసుక, మట్టి వ్యాపారాలతో పాటు అక్రమ నిర్మాణాలు, కబ్జాలకు సైతం తెగబడుతున్నారు. మహబూబ్‌నగర్ జిల్లా అంతటా ఈ పరిస్థితే కనిపిస్తోంది.

ఇసుక, మట్టి..: జిల్లాలో ఎక్కడ చూసినా మట్టి, ఇసుక దందాలకు ఆదివారం అడ్డే లేకుండా పోతోంది. ● అడ్డాకుల మండలం వర్ని పెద్దవాగు నుంచి ఇసుక తవ్వుతున్నారు. అడ్డాకుల సమీపంలో పలుగు గుట్ట నుంచి ఎర్రమట్టి ఇష్టారీతిన తరలిస్తున్నారు. ● సీసీకుంట మండలం లాల్‌కోట, నెల్లికొండి శివారు ఎర్రగుట్ట, మద్దూరు, బండ్రవల్లి ప్రాంతాల్లోని ఊకచెట్టు వాగులో ఇసుక తవ్వకాలు జరుగుతున్నాయి. ● కౌకుంట్ల మండలం రేకులంపల్లి శివారు పెద్దవాగు నుంచి ఏకంగా టిప్పర్లలో హైదరాబాద్‌కు తరలిస్తున్నారు. ● భూత్పూర్ మండలం తాటికొండ, హస్నాపూర్, అమిస్తాపూర్, భూత్పూర్ గుట్టల నుంచి మట్టి తవ్వి ట్రాక్టర్లు, లారీల్లో నింపి నిర్మాణాలు, వెంచర్లకు తరలిస్తున్నారు. ● మిడ్జిల్ మండలం కొత్తపల్లి శివారులోని దుందుభి వాగు నుంచి పెద్ద ఎత్తున ఇసుక తవ్వకాలు చేపడుతున్నారు.


వారమంతా నిల్వ ఉంచి..: మట్టి, ఇసుకను అక్రమార్కులు తవ్వి వారమంతా కంప, చెట్ల పొదల్లో నిల్వ ఉంచి ఆదివారం, సెలవు దినాల్లో ఇతర ప్రాంతాలకు తరలిస్తున్నారు. ట్రాక్టర్ ఇసుకకు రూ.3-6 వేలు పలుకుతోంది. దూరాన్ని బట్టి టిప్పర్ రూ.25 - 40 వేలకు విక్రయిస్తున్నారు.

అక్రమ నిర్మాణాలు సైతం..: భూముల కబ్జాలు, చెరువుల ఆక్రమణలు, అనుమతుల్లేకుండా రోడ్డు పక్కన, ప్రభుత్వ, అసైన్డ్ భూముల్లో నిర్మాణాలు ఇలాంటివి ఆదివారాల్లోనే చేస్తున్నారు.



జడ్చర్ల: అల్వాన్‌పల్లి, కుర్వగడ్డపల్లి శివారుల్లో దుందుభి వాగులో ఫిల్టర్ ఇసుక తయారీ

ఫిల్టర్ చేసి..: జడ్చర్ల మండలం ఉదండాపూర్ రిజర్వాయర్ ప్రాంతాల్లో, అల్వాన్‌పల్లి, కుర్వగడ్డపల్లి, దేవరకద్ర మండలం వెంకటాయపాలెం, కోయిలకొండ మండలం వెంకటాపూర్, భూత్పూర్ మండలంలోని పలు ప్రాంతాల్లో దర్జాగా కృత్రిమ ఇసుక తయారు చేస్తున్నారు. టిప్పర్లు, ట్రాక్టర్లలో మహబూబ్‌నగర్, దేవరకద్ర, జడ్చర్ల తదితర పట్టణ ప్రాంతాలకు తరలిస్తున్నారు. ఇసుక నేలలున్న పొలాలను ఇసుక మాఫియా కొని మరీ కృత్రిమంగా తయారు చేస్తున్నారు.





పనుల నాణ్యతపై నిలదీత

కొత్తకోట, న్యూస్‌టుడే : కానాయపల్లి పునరావాస గ్రామంలో ఇంటి స్థలాల పునరుద్ధరణపై ఇంజినీరింగ్ అధికారుల పర్యవేక్షణ కొరవడిందని గ్రామ యువకులు ఆందోళన వ్యక్తం చేస్తూ పనుల్ని అడ్డుకున్నారు. ఇంటి స్థలాలు, దారులు ఎగుడు, దిగుడుగా ఉన్నందున వాటిని సరి చేయాలని కలెక్టర్ ఆదేశిస్తూ నిధులు విడుదల చేశారని గుర్తు చేశారు. గుట్ట నుంచి ప్రత్యేకంగా మట్టిని తెచ్చి చదును చేయాల్సి ఉండగా ప్లాట్ల సమీపంలో ఉండే మట్టిని, కంకర డస్టుతో నామమాత్రంగా పనులు చేస్తున్నట్లు భీమన్న నాయుడు ఆధ్వర్యంలో పలువురు ఆందోళన వ్యక్తం చేశారు. గుత్తేదారులు నాణ్యతతో పనులు చేయడం లేదని, ఇంజినీర్లు పర్యవేక్షించి పూర్తి చేయించాలని డిమాండ్ చేశారు.



ప్రశ్నిస్తున్న గ్రామ యువకులు



ఆహ్లాదం కారాదు.. విషాదం



అలంపూర్ జోగులాంబ ఆలయాల సమీపంలోని తుంగభద్రకు శ్రీశైలం వెనక జలాలు రావడంతో నది నిండు కుండలా మారింది. ఆలయాలు, పట్టణం రక్షణ కోసం ఏర్పాటు చేసిన కరకట్టకు రెండు వైపుల ఉన్న దిమ్మెలు ధ్వంసం కావడంతో ప్రమాదకరంగా మారింది. నది దృశ్యాలు తిలకించేందుకు భక్తులు కట్టపైకి వెళ్తున్నారు. కొందరు యువకులు కట్ట పైనుంచి నదిలోకి దూకుతూ ఈత కొడుతున్నారు. ఈతరాని పిల్లలు సైతం దానిపైకి వెళ్లి కూర్చుంటున్నారు. అదుపుతప్పితే ప్రమాదం జరిగే అవకాశం ఉంది. ఇప్పటికైనా అధికారులు కరకట్టపై దిమ్మెలు ఏర్పాటు చేయాలని భక్తులు, పట్టణవాసులు కోరుతున్నారు. – న్యూస్‌టుడే, అలంపూర్



నిండా మొక్కలు.. నీరు రాక చిక్కులు



సాగునీటిని అందించే ఆర్డీఎస్ ఉప కాల్వలు అధ్వానంగా మారడంతో అరకొర నీరొచ్చినా అందని పరిస్థితి నెలకొంది. మాన్‌దొడ్డి, పెద్ద ధన్వాడ, పచ్చర్ల, తుమ్మిళ్ల, అశోక్‌నగర్, రాజోలి గ్రామాల్లో ఆర్డీఎస్ కాల్వ ప్రధాన డిస్ట్రిబ్యూటర్ల కింద వివిధ రకాల ఉప కాల్వలున్నాయి. వాటి నిర్వహణ లేకపోవడంతో పిచ్చి మొక్కలు విపరీతంగా పెరిగి సాగునీటిపారుదలకు ఇబ్బందిగా మారింది. ఇప్పటికే నీరు లేక పంటలకు గడ్డుకాలం ఉండగా, రానున్న రోజుల్లో నీరొచ్చినా గడ్డి, పిచ్చిమొక్కల కారణంగా అందే పరిస్థితి లేకుండా పోతోందని రైతులు వాపోతున్నారు. **-న్యూస్‌టుడే, రాజోలి**

ఆర్టీసీ వైపే మహిళల చూపు

కందనూలు, కల్వకుర్తి, న్యూస్‌టుడే: రాష్ట్ర ప్రభుత్వం మహాలక్ష్మి పథకం ప్రవేశపెట్టిన తర్వాత పల్లె వెలుగులు, ఎక్స్‌ప్రెస్ బస్సులు మహిళా ప్రయాణికులతో కిక్కిరిసిపోతున్నాయి. వివిధ గ్రామాలకు, పట్టణాలకు వెళ్లడానికి ఆలస్యమైనా పల్లెవెలుగు, ఎక్స్‌ప్రెస్ కోసం ఎదురుచూస్తున్నారు. ప్రయాణ ప్రాంగణానికి బస్సు వచ్చిన రెండు, మూడు నిమిషాల్లోనే సీట్లు పూర్తిగా నిండిపోతున్నాయి. ఇందులో ఎక్కువ శాతం మహిళా ప్రయాణికులే ఉంటున్నారని ఆర్టీసీ అధికారులు పేర్కొంటున్నారు. మహాలక్ష్మి పథకం ప్రారంభం కాకముందు ఉమ్మడి పాలమూరు రీజియన్ పరిధిలో మొత్తం ప్రయాణికుల సంఖ్య సగటున రోజుకు 1.55 లక్షలు ఉండగా.. పథకం అమలయ్యాక 2.90 లక్షలకు పైగా చేరిందని, అందులో 1.70 లక్షలకు పైగా మహిళలే ఉంటున్నారని అధికారులు చెబుతున్నారు. ప్రభుత్వం మహాలక్ష్మి పథకం ప్రారంభించిన తర్వాత 2023 ఏడాది డిసెంబరు 9 నుంచి ప్రస్తుత ఏడాది మే 20 వరకు దాదాపుగా 894 రోజులను పరిశీలిస్తే ఉమ్మడి జిల్లా పరిధిలో 2172.27 లక్షల మంది మహిళలు ఆర్టీసీ బస్సుల్లో ప్రయాణించినట్లు అధికారులు ప్రకటించిన గణాంకాలు స్పష్టం చేస్తున్నాయి.



నాగర్‌కర్నూల్: ప్రయాణ ప్రాంగణంలో బస్సు ఎక్కడానికి సిద్ధమవుతున్న మహిళలు

రూ.752.06 కోట్ల ఆదాయం

ఉమ్మడి పాలమూరు రీజియన్ పరిధిలో ఆర్టీసీ డిపోలకు మహాలక్ష్మి పథకం ద్వారా 2023 సంవత్సరం డిసెంబరు 9 నుంచి ప్రస్తుత ఏడాది మే 20 వరకు చార్జీల రూపంలో రూ. 752.06 కోట్ల మేర ఆదాయం వచ్చింది. ఇందులో మహబూబ్‌నగర్ జిల్లా పరిధిలో 650.21 లక్షల మంది మహిళలు ప్రయాణించడంతో రూ.225.53 కోట్లు, నాగర్‌కర్నూల్ జిల్లా పరిధిలోని కల్వకుర్తి, నాగర్‌కర్నూల్, అచ్చంపేట, కొల్లాపూర్ డిపోల పరిధిలో 631.09 లక్షల మంది ప్రయాణించడంతో రూ.218.20 కోట్లు వచ్చాయి. నారాయణపేట జిల్లా పరిధిలో 301.16 లక్షల మందికి రూ.104.39 కోట్లు, జోగులాంబ గద్వాల జిల్లా పరిధిలో 280.84 లక్షల మందికి రూ.96.97 కోట్లు, వనపర్తి జిల్లా పరిధిలో 308.97 లక్షల మంది మహిళల వల్ల రూ.106.98 కోట్లు వచ్చినట్లు అధికారులు చెబుతున్నారు. ఉమ్మడి రీజియన్ పరిధిలో మహబూబ్‌నగర్ జిల్లాలో ఎక్కువ శాతం మంది మహిళలు ఆర్టీసీ బస్సుల్లో ప్రయాణించగా.. తర్వాత స్థానంలో నాగర్‌కర్నూల్ జిల్లా నిలిచింది.



అలంపూర్, న్యూస్‌టుడే: అలంపూర్ బాలబ్రహ్మేశ్వరాలయం ఉదయం 6.00 గంటలకు, జోగులాంబ అమ్మవారి ఆలయం ఉదయం 6.30 గంటలకు తెరుస్తారు. స్వామివారి ఆలయంలో ఉదయం 7.30 నుంచి 11 గంటల వరకు అభిషేకం, అర్చనలు, స్పర్శ దర్శనం, 11.30 నుంచి 12 గంటల వరకు నివేదన, మహా మంగళహారతి ఉంటాయి. మధ్యాహ్నం 1 నుంచి 2 గంటల వరకు ఆలయాలు మూసివేస్తారు. తిరిగి మధ్యాహ్నం 2 నుంచి 4 గంటల వరకు అభిషేకం, అర్చనలు, స్పర్శ దర్శనం, సాయంత్రం ఆరు గంటలకు స్వామివారి ఆలయంలో రథోత్సవం, రాత్రి 7.30 గంటలకు మహా మంగళహారతి, జోగులాంబ ఆలయంలో ఉదయం 7.30 నుంచి 10.30 గంటల వరకు త్రిశతి అర్చన, మధ్యాహ్నం 2 నుంచి 4.30 గంటల వరకు ఖడ్గమాల అర్చనలు కొనసాగుతాయి. రాత్రి 7 గంటలకు మహా మంగళహారతి అనంతరం రాత్రి 8.30 గంటలకు ఆలయాలు మూసివేస్తారు.

అసంపూర్తి పనులతో అవస్థలు



పుర పరిధిలోని రెండో అంగన్‌వాడీ కేంద్రంలో అదనపు గదుల నిర్మాణాలు చేపట్టడానికి దాదాపుగా ఆరు సంవత్సరాల కిందట పనులు ప్రారంభించారు. సంబంధిత గుత్తేదారుడు స్లాబ్ వేసి గోడల నిర్మాణాలు చేపట్టకుండా వదిలేసి వెళ్లిపోయాడు. ప్రస్తుతం ఒకే గది ఉండటంతో చిన్నారులు, గర్భిణులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ఉన్నతాధికారులు స్పందించి పనులు త్వరగా పూర్తి చేయాలని కోరుతున్నారు. **-న్యూస్‌టుడే, కందనూలు**

నాట్య మయూరాలు

కూచిపూడిలో రాణిస్తూ.. శిక్షణనిస్తున్న మహిళలు

జడ్చర్ల పట్టణం, వనపర్తి, న్యూస్‌టుడే: కూచిపూడి నృత్యమంటే చిన్నప్పటి నుంచి ఇష్టం. ఈ రంగంలో భవిష్యత్తులో రాణించేందుకు శిక్షణ తీసుకుని పట్టు సాధించారు. పలు వేదికలపై ప్రదర్శనలిస్తూ ప్రశంసలు అందుకుంటున్నారు. అంతటితో ఆగిపోకుండా చిన్నారులకు శిక్షణ ఇస్తూ కళాకారులుగా తీర్చిదిద్దుతున్నారు. ఈ నాట్యకారిణులను 'న్యూస్‌టుడే' పలకరించింది.



వెయ్యి మందికి శిక్షణ

మాది వనపర్తి పట్టణం. జడ్చర్లలో ఉంటున్నా. గురువు వద్ద శిక్షణ తీసుకున్నా. కూచిపూడిలో సర్టిఫికెట్ కోర్సు, డిప్లొమా, తెలుగు విశ్వవిద్యాలయంలో ఎంఏ కూచిపూడి కోర్సు పూర్తి చేశా. 80కి పైగా ప్రదర్శనలిచ్చి బహుమతులు పొందా. 'సాయికృప కూచిపూడి కళాక్షేత్రం' ఆధ్వర్యంలో 13 ఏళ్లుగా శిక్షణ ఇస్తున్నా. వెయ్యి మంది చిన్నారులను తీర్చిదిద్దాను. వీరు రాష్ట్ర, జాతీయ స్థాయిలో ప్రదర్శనలిచ్చి ప్రతిభ కనబరుస్తున్నారు. నృత్యంతో పాటు శ్లోకాలు, ముద్రలు, తాళాలు, పాటలు నేర్పిస్తున్నా. నాకు నాట్య మయూరి, నాట్యశ్రీ, నృత్య ప్రతిభ కళారత్న, నాట్యహంస, నాట్య మంజీరా పురస్కారాలు దక్కాయి. సర్కారు పాఠశాలల విద్యార్థులకు ఉచిత శిక్షణ ఇస్తున్నా. **- పడాల బిందుమాధవి**



25 ప్రదర్శనలిచ్చా..

జడ్చర్ల వెంకటేశ్వరకాలనీ మాది. అమ్మానాన్న ఆరేళ్లు ప్రత్యేక శిక్షణ ఇప్పించారు. కర్ణాటక సంగీతంలో సర్టిఫికెట్ కోర్సు చేస్తున్నా. దేవస్థానాలు, వివిధ వేదికల్లో నిర్వహించిన రాష్ట్ర, జాతీయ స్థాయి నృత్య ప్రదర్శనల్లో బహుమతులు సాధించా. 25 నృత్య ప్రదర్శనలిచ్చా. అమెరికా, దుబాయ్, ఆస్ట్రేలియాలో చిన్నారులకు ఆన్‌లైన్ ద్వారా శిక్షణ ఇస్తున్నా. ఏడాది కిందట 'కృష్ణ తరంగిణి నృత్యాలయం' ఏర్పాటు చేశా. వంద మంది పిల్లలకు శిక్షణ ఇస్తున్నా. వీరు మంచి ప్రదర్శనలు ఇస్తున్నారు. కళాకార్ బుక్ ఆఫ్ వరల్డ్ రికార్డ్స్ సాధించా. మయూరి నర్తకి, నంది పురస్కారాలు అందుకున్నా. కూచిపూడి నృత్యంలో మరింత రాణించడమే నా లక్ష్యం. **- చిగుళ్లపల్లి సంధ్య**

పట్టుబట్టు.. గోల్ కొట్టు



సెలవొస్తే చాలు జడ్చర్ల మినీ స్టేడియం కిటకిటలాడుతుంటుంది. వయసుతో సంబంధం లేకుండా వివిధ రకాల క్రీడలు సాధన చేస్తుంటారు. ఆదివారం పిల్లల నుంచి 50 ఏళ్ల వయసున్న వారు ఫుట్‌బాల్ ఆడటం ఆకట్టుకుంది. ఫుట్‌బాల్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ప్రతి వారం సాధన చేస్తూ ఆరోగ్యంగా ఉంటున్నామని వారు చెబుతున్నారు. **- న్యూస్‌టుడే, జడ్చర్ల పట్టణం**

తరగతి గది.. విజ్ఞాన నిధి

వినూత్నంగా బోధిస్తున్న ఉపాధ్యాయినులు





పాలమూరు, న్యూస్‌టుడే: ఉపాధ్యాయినులు తరగతి గదిలో నాలుగు గోడల మధ్య దేశ భవితను నిర్మిస్తున్నారు. నల్లపలక వంటి మెదడులో విజ్ఞానమనే అక్షరాలు దిద్ది, వారిని ఉత్తమ పౌరులుగా తీర్చిదిద్దడానికి కృషి చేస్తున్నారు. విద్యార్థుల జీవితాల్లో విజ్ఞాన కాంతులు వెదజల్లుతున్నారు. బోధనోపకరణాలతో వినూత్నంగా బోధిస్తూ అందరి మన్ననలు అందుకుంటున్నారు.

ఆకర్షించేలా.. అన్వేషించేలా.. : మహబూబ్‌నగర్‌లోని ప్రభుత్వ బేసిక్ ప్రాక్టీసింగ్ ఉన్నత పాఠశాల ఆంగ్ల ఉపాధ్యాయిని **వి.స్వప్న** సులువైన మార్గాలతో విద్యార్థులకు వినూత్నంగా బోధిస్తున్నారు. పాఠ్యాంశాలను ఆకర్షించేలా, అన్వేషించేలా, వివరించేలా, విస్తరించేలా, మదింపు చేసేలా.. ఇలా పది సార్వత్రిక టీఎల్ఎం బోధనా పద్ధతులను బోధనకు వినియోగిస్తున్నారు. ఆటల ద్వారా, గ్రూప్ యాక్టివిటీ, ప్రశ్నల పెట్టె, రియల్ లైఫ్ లింక్, మల్టీ సెన్సార్, లో కాస్ట్-నో కాస్ట్, డిజిటల్ విధానాల్లో బోధిస్తూ విద్యార్థుల మన్ననలు అందుకుంటున్నారు.



భయం పోగొట్టి..: బాలానగర్ మండలం పెద్ద రేవల్లి ఎంపీపీ పాఠశాల ఎస్జీటీ ఉపాధ్యాయిని **పాలాది శ్రీవాణి** తనదైన శైలిలో బోధిస్తున్నారు. 16 ఏళ్ల నుంచి ఆంగ్లంలో విద్యార్థులకు ప్రాథమిక స్థాయి నుంచి శిక్షణ ఇస్తున్నారు. ఆంగ్లంపై ఉన్న భయాన్ని పోగొట్టి. టీఎల్ఎంతో కథలను అనుసంధానించి బోధిస్తున్నారు. ఆంగ్లంలో మాట్లాడేలా చేస్తున్నారు. ప్రత్యేకంగా బ్రిడ్జింగ్ గ్యాప్ యాక్టివిటీతో విద్యార్థుల్లో లెర్నింగ్ గ్యాప్‌ను తగ్గిస్తున్నారు. బోధనలో ఆమె చొరవ రాష్ట్ర స్థాయిలో రిసోర్స్‌పర్సన్‌గా నిలబెట్టాయి. పూర్వ ప్రాథమిక విద్య కరికులం డెవలపర్‌గా తన వంతు పాత్ర పోషిస్తున్నారు.



దృశ్య ప్రధానంగా..: మహబూబ్‌నగర్‌లోని ప్రభుత్వ మోడల్ బేసిక్ ఉన్నత పాఠశాల స్కూల్ అసిస్టెంట్ (జీవశాస్త్రం) **సి.అరుణమ్మ** విద్యార్థులకు సహజ పద్ధతిలో బోధిస్తున్నారు. ఆయా పాఠ్యాంశాలు బోధించడం కంటే దృశ్య ప్రధానంగా చేసి చూపడానికే ప్రాధాన్యం ఇస్తున్నారు. పాఠాలకు అనుగుణంగా టీఎల్ఎంలను తయారు చేసి విద్యార్థులకు చూపుతూ బోధిస్తున్నారు. వెనకబడిన విద్యార్థులు సైతం అర్థం చేసుకుంటున్నారు. తడబాటు లేకుండా పరీక్షల్లో సమాధానాలు రాసి మంచి మార్కులు తెచ్చుకుంటున్నారు.

విద్యార్థులే గురువులు.. నాయకులు : కోయిలకొండ మండలం పారుపల్లి జడ్పీ ఉన్నత పాఠశాల స్కూల్ అసిస్టెంట్ **ఎ.వంశీలత** చిన్నారులకు ఆంగ్లంలో వినూత్నంగా బోధిస్తున్నారు. పనిచేస్తూ నేర్చుకోవడం అనే పద్ధతి ఆధారంగా లిటిల్ టీచర్-లిటిల్ లీడర్ అనే భావనతో విద్యార్థులే చిన్న ఉపాధ్యాయులుగా, చిన్న నాయకులుగా మారి సహచరులకు పాఠ్యాంశాలను వివరించేలా ప్రోత్సహిస్తున్నారు. దీని ద్వారా విద్యార్థుల్లో చదవడం అలవాటు చేయడంతో పాటు కమ్యూనికేషన్ స్కిల్స్ పెరిగి నాయకత్వ లక్షణాలు వృద్ధి చెందుతాయి. వారిలో ఆత్మవిశ్వాసం పెంచి.. ప్రతి విద్యార్థిని అభ్యసన ప్రక్రియలో చురుకైన భాగస్వామిగా తీర్చిదిద్దడానికి కృషి చేస్తున్నారు.

దాతలు నిర్మించినా.. నిరుపయోగమే



తాళం వేసిన మరుగుదొడ్లు, మూత్రశాలలు

జడ్చర్ల న్యూటౌన్, న్యూస్‌టుడే: మరుగుదొడ్లు, మూత్రశాలలు లేక కొన్ని పాఠశాలల్లో విద్యార్థులు ఇబ్బందులు పడుతున్నారు. కానీ మిడ్జిల్ మండలం వస్పుల ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో అవి ఉన్నా వినియోగించని దుస్థితి. ఈ బడి పీఎంశ్రీ పథకం కింద ఎంపికైంది. కానీ వసతులు మాత్రం మెరుగుపడలేదు. 240 మంది విద్యార్థులు చదువుతున్నా కనీస సౌకర్యాలు లేవు. దీంతో గతేడాది ఓ స్వచ్ఛంద సంస్థ రూ.లక్షలు ఖర్చు చేసి మూత్రశాలలు, మరుగుదొడ్లు, చేతులు కడుక్కునేందుకు కుళాయి, తాగునీటి ట్యాంకులు నిర్మించింది. నెలలు అవుతున్నా వాటిని ప్రారంభించడం లేదు. తాళం వేసి ఉంచడంతో విద్యార్థులు ఆరుబయటకు వెళ్తున్నారు. ఇప్పటికైనా అందుబాటులోకి తీసుకురావాలని కోరుతున్నారు.

దంత వైద్యం.. సేవలకు దూరం



మక్తల్ పట్టణంలోని ప్రభుత్వ ఆసుపత్రిలో మూడేళ్ల కిందట రూ.5 లక్షలు వెచ్చించి దంత చికిత్స యంత్రాన్ని ఏర్పాటు చేశారు. రెండేళ్లు వైద్య సేవలు అందించారు. గతంలో పని చేసిన దంత వైద్యుడు బదిలీపై వెళ్లడంతో పరికరాలు నిరుపయోగంగా మారాయి. ఇప్పటికైనా సంబంధిత అధికారులు దృష్టిపెడితే.. వైద్యసేవలు మళ్లీ ప్రారంభం అవుతాయనడంలో సందేహం లేదు. **- న్యూస్‌టుడే, మక్తల్ గ్రామీణం**

79 మెగావాట్ల విద్యుదుత్పత్తి

ఆత్మకూరు (అమరచింత), న్యూస్‌టుడే : జూరాల ప్రాజెక్టుకు కర్ణాటక నుంచి వరద రావడంతో ఆదివారం రెండు టర్బయిన్ల ద్వారా విద్యుదుత్పత్తి చేపట్టారు. ఎగువన ఒకటి, దిగువన ఒక టర్బయిన్‌లో 79 మెగావాట్ల ఉత్పత్తి జరిగిందని ఎస్ఈ శ్రీధర్ తెలిపారు. పవర్‌హౌస్ ద్వారా 5075 క్యూసెక్కుల నీరు వదులుతున్నట్లు ఆయన పేర్కొన్నారు.

సుమతి ఆశయాలు కొనసాగిద్దాం

మహబూబ్‌నగర్ నగరం, న్యూస్‌టుడే: సీపీఐ నాయకురాలు సుమతి ఆశయాలను కొనసాగిద్దామని ఆ పార్టీ కేంద్ర కమిటీ సభ్యురాలు రమాదేవి పేర్కొన్నారు. ఆదివారం మహబూబ్‌నగర్‌లోని ఓ ఫంక్షన్ హాల్లో నిర్వహించిన సుమతి సంతాప సభలో ఆమె ప్రసంగించారు. సుమతి విద్యార్థి దశ నుంచే అభ్యుదయ భావాలతో పనిచేసి, కులాంతర వివాహం చేసుకుని ఆదర్శంగా నిలిచారని తెలిపారు. మతోన్మాదానికి వ్యతిరేకంగా అనేక పోరాటాల్లో పాల్గొన్నారని గుర్తుచేశారు. సుమతి భర్త రాజ్యసభ మాజీ సభ్యుడు మధు, కుమార్తె డా.ప్రతిభ, అల్లుడు డా.మధుసూదన్‌రెడ్డి, సీపీఎం జిల్లా కార్యదర్శి రాములు, బాబురావు, వెంకటేశ్వరరావు, సాగర్, జంగారెడ్డి, మురళీకృష్ణ, వెంకట్రాములు, భూపాల్, శివప్రసాద్, శ్రీమన్నారాయణ, ఆచార్య ప్రసాదరావు, శివప్రసాద్, రాంరెడ్డి, గోపాల్, కురుమూర్తి పాల్గొన్నారు.



మాట్లాడుతున్న సీపీఎం కేంద్ర కమిటీ సభ్యురాలు రమాదేవి

అనుమానంతో మహిళ దారుణ హత్య

కేసును ఛేదించిన పోలీసులు

రాజాపూర్, న్యూస్‌టుడే: రాజాపూర్ మండలం రంగారెడ్డిగూడ సమీపంలో మహిళ హత్య కేసును పోలీసులు ఛేదించారు. ఈ నెల 18న జరిగిన ఈ ఘటనలో నిందితుడిని అరెస్టు చేసి, రిమాండ్‌కు తరలించారు. ఆదివారం రాజాపూర్ ఠాణాలో విలేకరుల సమావేశంలో డీఎస్పీ వెంకటేశ్వర్లు వివరాలు వెల్లడించారు. మధ్యప్రదేశ్ రాష్ట్రం రాజ్‌గఢ్ జిల్లా కచికేడికి చెందిన చోటేఖాన్ లారీ డ్రైవర్. మూడేళ్ల కిందట లారీ నడుపుతుండగా.. షాద్‌నగర్‌లో మహిళ పరిచయమైంది. ఆమె రెండేళ్ల కిందట లాలీ(35) అనే మహిళను చోటేఖాన్‌కు పరిచయం చేసింది. వనపర్తి జిల్లా ఏదుల మండలం సింగాయపల్లితండాకు చెందిన లాలీకి భర్త, ఇద్దరు పిల్లలున్నా బాలానగర్‌లోని అద్దె ఇంట్లో ఒంటరిగా ఉంటున్నారు.

పరిచయం ప్రేమగా మారి..: చోటేఖాన్, లాలీ పరిచయం ప్రేమగా మారింది. ఇద్దరు కలిసి మద్యం తాగేవారు. లాలీ బాలానగర్‌లో లారీ ఎక్కి చోటేఖాన్‌తో కలిసి బెంగళూరు, నాగ్‌పుర్, తమిళనాడుకు వెళ్లేవారు. అయితే ఆమె వేరే వ్యక్తులతో శారీరక సంబంధం పెట్టుకుందనే అనుమానంతో చోటేఖాన్ పలుమార్లు మందలించాడు. అతడి భార్య కూడా చనిపోవడంతో లాలీని పెళ్లి చేసుకొని, స్వగ్రామంలో ఉండేందుకు నిర్ణయించుకున్నాడు. ఈ విషయం ఆమెకు చెప్పినా చూద్దాంలే అని బదులిచ్చేవారు. ఈ విషయంలో ఇద్దరి మధ్య చాలాసార్లు గొడవలు జరిగాయి.



వివరాలు వెల్లడిస్తున్న డీఎస్పీ వెంకటేశ్వర్లు

అంతమొందించాడిలా...: చోటేఖాన్ లారీతో ఈ నెల 15న కేరళ నుంచి హరియాణాకు బయలుదేరాడు. మార్గంమధ్యలో ఆరు మద్యం సీసాలు కొనుగోలు చేశాడు. 18న బాలానగర్ సమీపంలోని ఓ పంక్చర్ దుకాణం దగ్గర లారీ ఆపి, లాలీకి ఫోన్ చేశాడు. హరియాణకు వెళ్తున్నానని, రావాలని కోరగా.. మరో లారీ వద్ద ఉన్నానని, ఐదు నిమిషాలు ఆగాలని ఆమె సమాధానమిచ్చారు. అనుమానం వచ్చి ఆమె ఉన్న చోటకు వెళ్లగా.. వేరే వ్యక్తులతో కనిపించారు. దీంతో ఎలాగైనా అంతమొందించాలని నిర్ణయించుకున్నాడు. అదే రోజు అర్ధరాత్రి ఆమెను లారీలో ఎక్కించుకున్నాడు. ఎందుకు మోసం చేశావని గొడవ పెట్టుకున్నాడు. అప్పటికే తాగిన మత్తులో ఉన్న చోటేఖాన్ క్షణికావేశంలో కూరగాయల కత్తితో ఆమె గొంతుపై పొడిచాడు. చనిపోయిందని నిర్ధారించుకొని మృతదేహాన్ని దుప్పటిలో చుట్టి, రాజాపూర్ మండలం రంగారెడ్డిగూడ సమీపంలో రహదారి పక్కన పడేశాడు. అనంతరం లారీతో బెంగళూరు వైపు పారిపోయాడు. 19న స్థానికుల ఫిర్యాదుతో కేసు నమోదు చేసిన పోలీసులు దర్యాప్తు చేపట్టారు. అద్దె గదిలో సిమ్‌కార్డు, కాల్ రికార్డు, సీసీ టీవీ ఫుటేజీ ఆధారంగా నిందితుడిని గుర్తించి అరెస్టు చేసినట్లు డీఎస్పీ తెలిపారు. కేసును 10 రోజుల్లోనే ఛేదించిన జడ్చర్ల గ్రామీణ సీఐ మహేశ్, రాజాపూర్ ఎస్సై రాజశేఖర్, సిబ్బందిని అభినందించారు.

ప్రశాంతంగా నీట్ పీజీ

354 మంది అభ్యర్థుల హాజరు

పాలమూరు, న్యూస్‌టుడే: మహబూబ్‌నగర్‌లో నిర్వహించిన నీట్ పీజీ అర్హత పరీక్ష -2026 ప్రశాంతంగా ముగిసింది. ఆదివారం ఉదయం స్థానిక క్రిస్టియన్‌పల్లిలోని ఫాతిమా విద్యాలయం, ధర్మాపూర్ వద్ద ఉన్న జయప్రకాశ్ ఇంజినీరింగ్ కళాశాలలో నీట్ పీజీ పరీక్ష సజావుగా సాగడంతో అధికారులు ఊపిరి పీల్చుకున్నారు. ఈ పరీక్షకు 360 మంది అభ్యర్థులకు 354 మంది (99 శాతం) హాజరయ్యారు. ఫాతిమా విద్యాలయంలో 180 మందికి 178 మంది, జయప్రకాశ్ ఇంజినీరింగ్ కళాశాలలో 180 మందికి 176 మంది హాజరయ్యారు. ఆరుగురు మాత్రమే గైర్హాజరయ్యారు. పరీక్షలను స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ మధుసూదన్ నాయక్ పరిశీలించారు. స్థానిక ఆర్టీసీ బస్టాండ్, రైల్వేస్టేషన్ వద్ద ఏర్పాటు చేసిన జీపీవోల సేవలను ఆరా తీశారు.



ఫాతిమా విద్యాలయం కేంద్రం వద్ద పరిశీలిస్తున్న ఎస్పీ జానకి

పోలీస్ బందోబస్తు: పరీక్ష కేంద్రాలకు పోలీస్ శాఖ పటిష్ఠ బందోబస్తు ఏర్పాటు చేసింది. కేంద్రాలను ఎస్పీ డి.జానకి ఆకస్మికంగా తనిఖీ చేశారు. బందోబస్తును స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ మధుసూదన్ నాయక్‌తో కలిసి పరిశీలించారు. ఏఆర్ అదనపు ఎస్పీ సురేశ్‌కుమార్, డీఎస్పీ వెంకటేశ్వర్లు, గ్రామీణ సీఐ గాంధీనాయక్ తదితరులు పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదంలో యువకుడి దుర్మరణం



వీరస్వామి

వీపనగండ్ల, న్యూస్‌టుడే: ద్విచక్ర వాహనం అదుపు తప్పి చెట్టును ఢీకొట్టిన ఘటనలో ఓ యువకుడు మరణించాడు. ఆదివారం రాత్రి వీపనగండ్ల-వెలగొండ మధ్య జరిగింది. పెబ్బేరు మండలం యాపర్లకు చెందిన పంచాయతీ వర్కరు వీరస్వామి(38) చిన్నంబావి మండలం దగడపల్లిలో జరిగిన శుభకార్యానికి వెళ్లి ఆదివారం రాత్రి స్వగ్రామానికి వస్తుండగా.. ద్విచక్ర వాహనం అదుపు తప్పి వెలగొండ సమీపంలో ఓ చెట్టును ఢీకొన్నాడు. తీవ్రంగా గాయపడిన వీరస్వామి గుర్తించి దారిన వెళ్లే వారు 108కు సమాచారమిచ్చారు. క్షతగాత్రున్ని వీపనగండ్ల ప్రభుత్వ ఆసుపత్రికి తీసుకురాగా.. అప్పటికే మృతి చెందినట్లు వైద్య సిబ్బంది తెలిపారు. ఈయనకు భార్య జోత్స్న, కుమార్తె ఉన్నారు.

సాంకేతికత తోడుగా.. భద్రత మెండుగా

ఏటీఆర్ సంరక్షణకు డ్రోన్ల వినియోగం

అమ్రాబాద్, న్యూస్‌టుడే: అమ్రాబాద్ పెద్దపులుల అభయారణ్యం(ఏటీఆర్) పరిరక్షణ ఆధునిక సాంకేతికత వినియోగంతో మరింత పటిష్ఠంగా మారింది. వన్యప్రాణులు, అరుదైన వృక్ష జాతులు, విలువైన కలపకు నిలయమైన నల్లమల పరిరక్షణకు వాచర్లు, ఎఫ్‌బీవోలు, ఎఫ్ఎస్ఓలు, ఎఫ్ఆర్వోలు నడుం బిగించారు. ప్రతి ప్రాంతాన్ని సిబ్బంది నిరంతరం ప్రత్యక్షంగా పర్యవేక్షించడం సాధ్యం కాకపోవటంతో కీలకమైన సాంకేతికతను ఆసరాగా చేసుకుంటున్నారు. అధికారుల కళ్లుగప్పి అక్రమాలకు పాల్పడుతున్న వేటగాళ్లు, స్మగ్లర్లు, ఆక్రమణదారుల ఆగడాలను అరికట్టేందుకు అధికారులు కెమెరాలు, డ్రోన్లు, ఈ-సర్వైలెన్స్ కెమెరాలు వినియోగిస్తూ అక్రమాలకు అడ్డుకట్ట వేస్తున్నారు.

వన్యప్రాణులు, వేటగాళ్ల కదలికలపై నిఘా: అడవి 2,611 చదరపు కి.మీ. మేర విస్తరించి ఉంది. అడవిలో జంతువులు తరచూ సంచరించే ప్రదేశాలు, మార్గాలు, నీటి వనరుల వద్ద, పులులు వన్యప్రాణులను చంపిన ప్రదేశాల్లో సిబ్బంది కెమెరాలను చెట్లపై నేలకు అడుగున్నర ఎత్తులో బిగిస్తారు. పులులు, ఎలుగుబంట్లు, ఇతర వన్యప్రాణులు కెమెరాల ఎదుట నుంచి వెళ్లినపుడు వాటి కదలికలను పసిగట్టి చిత్రాలను రికార్డు చేస్తాయి. దీంతో అడవిలోని వన్యప్రాణుల సంచారంపై సమాచారం తెలుస్తుంది. అడవిలోకి అక్రమంగా ప్రవేశించే వేటగాళ్లు, స్మగ్లర్లు, అటవీ ఆక్రమణదారుల చిత్రాలు కెమెరాల్లో రికార్డవుతాయి. గతంలో మద్దిమడుగు రేంజ్, అచ్చంపేట రేంజ్‌లలో వేటగాళ్లు జంతువులను వేటాడి మాంసాన్ని తీసుకెళ్తూ కెమెరాలకు చిక్కారు. వీటి ఆధారంగా నిందితులను గుర్తించి కేసులు నమోదు చేసి జైలుకు పంపారు. కెమెరాలో నిక్షిప్తమైన చిత్రాలను డేటాబేస్‌లో నిల్వ చేస్తారు.



అడవిలో చెట్లకు కెమెరాలు బిగిస్తున్న సిబ్బంది

డ్రోన్లతో పరిశీలన

ఏటీఆర్‌లో మనుషులు చేరుకోలేని లోయలు, ఎత్తైన కొండ ప్రాంతాలను పరిశీలించేందుకు రెండు అధునాతన డ్రోన్లను వినియోగిస్తున్నారు. అటవీ ఆక్రమణలు, కలప నరికివేత, మానవ సంచారం, అగ్నిప్రమాదాల సమాచారాన్ని తెలుసుకునేందుకు డ్రోన్లు సహాయపడుతున్నాయి. వీటితో తక్కువ సమయంలో ఎక్కువ విస్తీర్ణాన్ని పరిశీలించే అవకాశం ఉంటుంది. వేసవిలో అగ్నిప్రమాదాలు చోటుచేసుకున్న సందర్భాల్లో మంటల వ్యాప్తి నిరోధానికి ఎంతగానో ఉపయోగపడుతుంది. అత్యాధునిక డ్రోన్లు 10 కి.మీ. విస్తీర్ణంలోనూ చిత్రాలను చిత్రీకరిస్తాయి.

మేమున్నాం.. మీకు తోడుగా.. ఉ॥ 10 గం. నుంచి మ॥ 1 వరకు

వనపర్తి : 8008573864	అమరచింత : 8008573841
పెబ్బేరు పట్టణం : 9676809678	మదనాపురం : 9121229047
కొత్తకోట గ్రామీణం : 8008573855	చిన్నంబావి : 9121229043
పాన్‌గల్ : 8008574927	

?: పట్టణంలోని పెద్ద చౌడేశ్వరీ ఆలయ సమీపంలోని మ్యాన్‌హోళ్ల వద్ద మురుగు, ప్లాస్టిక్ వ్యర్థాలు నిలిచి దుర్వాసన వస్తోంది. - **నాగరాజు** ✔: పారిశుద్ధ్య సిబ్బందిని పంపించి పూడిక తీయించి సమస్య పరిష్కరిస్తాం.
- **యోగేశ్ కుమార్, పుర శానిటరీ ఇన్‌స్పెక్టర్, పెబ్బేరు**
- **న్యూస్‌టుడే, పెబ్బేరు పట్టణం**

తెరపై ఈనాడు

వనపర్తి, న్యూస్‌టుడే: శ్రీనివాస: ఇరుముడి, **శ్రీరామ :** విశ్వనాథ్ అండ్ సన్స్, **శ్రీరంగ :** టాక్సిక్, **వెంకటేశ్వర :** హాయ్

దొడ్డు బియ్యం.. వేలానికి సిద్ధం

- సెప్టెంబరు 2 వరకు టెండర్ల గడువు
- నిల్వలు పరిశీలిస్తున్న అధికారులు


వనపర్తి గోదాంలో నిల్వ ఉన్న దొడ్డు బియ్యం బస్తాలు

వనపర్తి పట్టణం, అయిజ, న్యూస్‌టుడే: రేషన్ దుకాణాలు, స్టేజి-1, స్టేజి-2 గోదాముల్లో నిల్వ ఉన్న దొడ్డు బియ్యాన్ని వేలం వేయాలని పౌరసరఫరాల శాఖ అధికారులు నిర్ణయించారు. ఈ మేరకు ఎంతమేర నిల్వలు ఉన్నాయనేది ఉన్నతాధికారులకు పంపించారు. వారు తాజాగా పరిశీలించి వేలం వేసేందుకు చర్యలు చేపట్టారు. మొన్నటి వరకు దొడ్డు బియ్యం ముక్కిపోతున్నా అధికారులు పట్టించుకోవడం లేదనే విమర్శలు వెల్లువెత్తాయి. మొదట్లో దొడ్డు బియ్యం నిల్వలపై ప్రత్యేక దృష్టి పెట్టి అనంతరం మరిచారు. గతంలో వీటిని వేలం వేయాలని రాష్ట్ర పౌరసరఫరాల శాఖ రెండు సార్లు నిర్ణయం తీసుకొని వెనక్కి తగ్గారు. ఉమ్మడి జిల్లాలో గోదాములు, చౌకధర దుకాణాల్లో కలిపి 45,656 క్వింటాళ్ల దొడ్డు బియ్యం నిల్వలు ఉన్నట్లు అధికారులు గుర్తించారు.

జిల్లా	దుకాణాలు	రేషన్ కార్డులు
గద్వాల	355	1,85,658
మహబూబ్‌నగర్	506	2,72,821
నాగర్‌కర్నూల్	558	2,72,487
నారాయణపేట	301	1,66,838
వనపర్తి	336	1,83,568

కిలో రూ.21.65 ధర..: దొడ్డు బియ్యానికి అధికారులు కిలో రూ.21.65 ధర నిర్ణయించారు. ఈ మేరకు జిల్లాల వారీగా ఎంతమేర నిల్వలు ఉంటే అంత వరకు టెండర్‌దారులు ప్రభుత్వానికి డబ్బులు చెల్లించాలి. ఈ నెల 28 నుంచి సెప్టెంబరు 2 వరకు ఆన్‌లైన్‌లో టెండర్లు వేసుకునే అవకాశం కల్పించారు. టెండర్లలో కనీస ధర కంటే ఎక్కువ నమోదు చేసిన వారికి అవకాశం కల్పిస్తారు. ఈ మేరకు డీలర్లకు దుకాణాల వారీగా నిల్వల వివరాల జాబితాను పంపనున్నారు. దీని ఆధారంగానే వారు నిల్వలు చూపాలి. లేనిపక్షంలో టెండర్ దాఖలు చేసిన ధర ప్రకారం డీలర్లు డబ్బులు చెల్లించాలి. ప్రస్తుతం అధికారులు గోదాముల్లో నిల్వలను పరిశీలిస్తుండగా డీలర్లు తరుగుపై ఆలోచిస్తున్నారు. 50 కిలోల బస్తా 16 నెలలుగా నిల్వ ఉంచితే కనీసం తరుగు వస్తుందని, దీన్ని ఎవరు భరిస్తారని ప్రశ్నిస్తున్నారు.

ఇందిరమ్మ ఇళ్లతో పేదల కళ్లలో ఆనందం: ఎమ్మెల్యే


లబ్ధిదారులకు నూతన వస్త్రాలు అందజేస్తున్న ఎమ్మెల్యే

కొత్తకోట గ్రామీణం, న్యూస్‌టుడే : ఇందిరమ్మ ఇళ్లతో పేదల కళ్లలో ఆనందం కనిపిస్తోందని దేవరకద్ర ఎమ్మెల్యే జి.మధుసూదన్‌రెడ్డి పేర్కొన్నారు. మండలంలోని అప్పరాలలో ఆదివారం నిర్వహించిన ఇందిరమ్మ ఇళ్ల గృహ ప్రవేశానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరై లబ్ధిదారులకు నూతన వస్త్రాలు అందించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. భారాస ప్రభుత్వం రెండు పడక గదుల ఇళ్ల పేరుతో పేదలకు మోసం చేసిందని విమర్శించారు. అర్హులైన లబ్ధిదారులకు తప్పనిసరిగా రెండో విడత ఇళ్లు అందజేస్తామన్నారు. కార్యక్రమంలో సీడీసీ ఛైర్మన్ చంద్రమోహన్ రెడ్డి, నాయకులు ప్రశాంత్, ఆంజనేయులు, రవి, దూలన్న, శ్రీనివాసులు, చంద్రుడు, కేశవులు, కృష్ణారెడ్డి, శేఖర్‌రెడ్డి పాల్గొన్నారు.

అసమానతల్లేని సమాజమే ధ్యేయం

పాన్‌గల్, న్యూస్‌టుడే: అసమానతలు లేని సమాజాన్ని నిర్మిద్దామని ఎమ్మార్పీఎస్ జిల్లా ఇన్‌ఛార్జి మస్తాన్ పిలుపునిచ్చారు. పాన్‌గల్‌లో ఆదివారం ఎమ్మార్పీఎస్, అనుబంధ సంఘాలతో సమావేశం నిర్వహించారు. సెప్టెంబర్ 9న వరంగల్‌లో నిర్వహించే సదస్సుకు తరలిరావాలని కోరారు. నాయకులు చెన్నకేశవులు, మీసాల నాగరాజు, రామకృష్ణ, గంధం లక్ష్మయ్య, ఆదిప్రభాస్, తదితరులు పాల్గొన్నారు.

గండానికి విముక్తి



స్పందనకు వందనం

ఖిల్లాగణపురం, న్యూస్‌టుడే : మండలంలోని మల్కిమియాన్‌పల్లి శివారులో అప్పారెడ్డిపల్లికి వెళ్లే ప్రధాన రహదారిపై కల్వర్టు వద్ద గొయ్యిని పూడ్చి వేశారు. ఈ నెల 28న 'ఈనాడు'లో 'గొయ్యి.. గండం' శీర్షికన ప్రచురితమైన చిత్ర కథనానికి పంచాయతీరాజ్ ఏఈ రమేశ్ నాయుడు, అప్పారెడ్డిపల్లి సర్పంచి నాగన్న స్పందించారు. రాళ్లు, మట్టిని పోసి పూడ్చి వేశారు. ఆయా గ్రామాల ప్రజలు, రైతులు హర్షం వ్యక్తం చేశారు.

డ్రైనేజీ నిర్మాణానికి భూమిపూజ

పాన్‌గల్, న్యూస్‌టుడే : మండలంలోని కేతేపల్లి గ్రామపంచాయతీ ఎదురుగా ఉన్న కాలనీలో అండర్ డ్రైనేజీ నిర్మాణ పనులకు ఆదివారం సర్పంచి రమేశ్ భూమిపూజ చేశారు. గ్రామపంచాయతీ ఎదురుగా ఉన్న కాలనీ రహదారిపై నీటినిల్వతో ప్రజల ఇబ్బందులపై ఈనెల 21న 'ఈనాడు'లో 'అడుసు తొక్కనిదే అడుగేయలేం' శీర్షికన ప్రచురితమైన చిత్ర వార్తకు పంచాయతీ అధికారులు స్పందించారు. ప్రజల ఇబ్బందులు తొలగించడానికి అండర్ డ్రైనేజీ నిర్మాణానికి శ్రీకారం చుట్టామని సర్పంచి తెలిపారు. కార్యక్రమంలో ఉప సర్పంచి కృష్ణవేణి, వార్డు సభ్యులు రామకృష్ణ, రాజేశ్, నాగార్జున, కృష్ణమ్మ, లక్ష్మి, నాయకులు అన్వేష్, వెంకటస్వామి, శ్రీకాంత్ పాల్గొన్నారు.

చెరువుల్లోకి నీటి విడుదల

గోపాల్‌పేట, న్యూస్‌టుడే : 'చెంతనే కేఎల్ఐ కాల్వ-చెరువుల్లోకి చేరని నీరు' శీర్షికన శనివారం 'ఈనాడు'లో ప్రచురితమైన కథనానికి నీటిపారుదలశాఖ అధికారులు స్పందించారు. ఉన్నతాధికారుల సూచనలతో నీటిపారుదల శాఖ ఏఈ ప్రవీణ్‌కుమార్ సంబంధిత రైతులతో మాట్లాడారు. చెరువుల్లోకి నీరు రాకుండా అడ్డుకున్న కొందరు రైతులకు నచ్చజెప్పారు. గ్రామ సర్పంచి భర్త సురేశ్ రైతులను ఒప్పించారు. ఆదివారం నల్ల చెరువు, కొత్తకుంట చెరువుల్లోకి నీరు వెళ్లేందుకు బుద్దారం జలాశయం ఎడమ కాల్వకు గతంలో మాదిరిగా పైపులు ఏర్పాటు చేశారు. దీంతో రెండు చెరువుల్లోకి నీరు వెళ్తోంది. ఆయకట్టు రైతులు సంతోషం వ్యక్తం చేశారు.

రాయితీ సరకులు ఇవ్వాలని డిమాండ్

అమరచింత, న్యూస్‌టుడే: కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు రేషన్ దుకాణాల్లో రాయితీతో నిత్యావసర సరకులు అందించాలని వ్యకాస జిల్లా అధ్యక్షుడు అజయ్ డిమాండ్ చేశారు. పట్టణంలో ఆదివారం విలేకర్ల సమావేశంలో మాట్లాడారు. ఉల్లిగడ్డ, పప్పు, నూనె, కూరగాయల ధరలు పెరగడంతో ప్రజలు ఇబ్బందులు పడుతున్నారన్నారు. ధరలను అదుపు చేయడంలో కేంద్రం విఫలం అయిందని విమర్శించారు. సమావేశంలో వ్యకాస నాయకులు నాగరాజు, విష్ణు, భగవంతు, శ్రీను తదితరులు పాల్గొన్నారు.

నేడు సీపీఎం ధర్నా


మాట్లాడుతున్న సీపీఎం జిల్లా కార్యదర్శి పుట్ట ఆంజనేయులు

కొత్తకోట, న్యూస్‌టుడే : ఎన్నికల ముందు ఇచ్చిన హామీలు అమలు చేయాలని డిమాండ్ చేస్తూ అన్ని మండల కేంద్రాల వద్ద సోమవారం ధర్నా చేస్తున్నట్లు సీపీఎం జిల్లా కార్యదర్శి పుట్ట ఆంజనేయులు తెలిపారు. ఆదివారం కొత్తకోటలో జరిగిన ముఖ్య కార్యకర్తల సమావేశంలో ఆయన మాట్లాడారు. ప్రభుత్వం పేదలకు 14 రకాల నిత్యావసర సరుకుల్ని ప్రజా పంపిణీలో అందిస్తామని చెప్పి మూడేళ్లు కావస్తున్నా పట్టించుకోవడం లేదని తెలిపారు. ఎన్నికల హామీలను అమలు చేసే వరకు పోరాటాలు చేస్తామన్నారు. తమ ఆందోళనకు మద్దతుగా ప్రజలు తహసీల్దార్ కార్యాలయాలకు చేరుకోవాలని కోరారు. సమావేశంలో పార్టీ ముఖ్య నాయకులు జబ్బార్, బాల్‌రెడ్డి, మండ్ల రాజు, నిక్సన్ తదితరులు పాల్గొన్నారు.

దళిత క్రైస్తవులను ఎస్సీలుగా గుర్తించాలి

ఆత్మకూరు(అమరచింత), న్యూస్‌టుడే: దళిత క్రైస్తవులను ఎస్సీలుగా గుర్తించాలని కుల అసమానతల నిర్మూలన పోరాట సమితి రాష్ట్ర ప్రధాన కార్యదర్శి గోవిందు అన్నారు. ఆత్మకూరులో ఆదివారం ఎంబీ చర్చి వద్ద కరపత్రాలు విడుదల చేసి మాట్లాడారు. ఆర్టికల్ 25 ప్రకారం ఏ మతాన్నైనా స్వీకరించే హక్కు రాజ్యాంగం కల్పించిందని తెలిపారు. కార్యక్రమంలో నాయకులు జెర్మియా, ఎస్తేరమ్మ, మల్లేశ్, మధు పాల్గొన్నారు.

సమస్య పరిష్కారానికి కేంద్ర మంత్రి హామీ



కేంద్రమంత్రి కిషన్‌రెడ్డికి వినతిపత్రం అందజేస్తున్న భాజపా నాయకులు

పెబ్బేరు పట్టణం, న్యూస్‌టుడే : జాతీయ రహదారి-44 పక్కన ప్రభుత్వ మహిళా పాలిటెక్నిక్ కళాశాల నుంచి కొత్తకోట బైపాస్ వెళ్లే జాతీయ రహదారికి అండర్‌పాస్, సర్వీస్ రోడ్డు, ఫ్లై ఓవర్ నిర్మించాలని కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డిని ఆదివారం భాజపా నాయకులు కోరారు. జోగులాంబ అలంపూర్ ఆలయానికి వెళ్తున్న మంత్రిని కొత్తకోట బైపాస్ వద్ద నాయకులు కలిసి వినతిపత్రం ఇచ్చారు. సమస్యను పరిశీలించి అవసరమైన చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారని నాయకులు తెలిపారు. కార్యక్రమంలో పార్టీ జిల్లా ఉపాధ్యక్షుడు రాఘవేంద్రగౌడ్, ప్రధాన కార్యదర్శి శ్రీనివాస్‌గౌడ్, అధికార ప్రతినిధి ఆంజనేయులు, కౌన్సిల్ సభ్యుడు రంగస్వామిగౌడ్, మండల,పట్టణ అధ్యక్షులు నాగరాజు యాదవ్, క్రాంతికుమార్, నాయకులు పాల్గొన్నారు.

నేడు జూరాలకు కిషన్ రెడ్డి రాక

అమరచింత, న్యూస్‌టుడే : మండలంలోని జూరాల ప్రాజెక్టును సోమవారం ఉదయం 11 గంటలకు కేంద్ర మంత్రి కిషన్ రెడ్డి సందర్శిస్తారని భాజపా రాష్ట్ర నాయకుడు బంగ్లా లక్ష్మీకాంత్ రెడ్డి తెలిపారు. ఆయన వెంట మహబూబ్ నగర్ ఎంపీ డీకే అరుణ, భాజపా రాష్ట్ర నాయకులు ఉంటారని పేర్కొన్నారు.

మిక్స్‌డ్ మార్షల్ ఆర్ట్స్‌లో సత్తా


శివనాయక్

ఖిల్లాగణపురం, న్యూస్‌టుడే: జాతీయ స్థాయి మిక్స్‌డ్ మార్షల్ ఆర్ట్స్‌లో ఖిల్లాగణపురం మండలం గార్లబండతండాకు చెందిన శివనాయక్ ప్రతిభ కనబరిచారు. ఈ నెల 29న నవీ ముంబై వాషిలో జరిగిన వారియర్స్ డ్రీమ్ సీరిస్ పోటీల్లో 57 కిలోల విభాగంలో మణిపుర్ వాసి అలెక్స్‌సపమ్‌తో తలపడి నెగ్గాడు. ఇప్పటి వరకు 37 ఈవెంట్లలో తలపడినట్లు శివనాయక్ ఆదివారం తెలిపారు. హరియాణలో శిక్షణ పొందుతూ తెలంగాణ తరపున జాతీయ స్థాయి మిక్స్‌డ్ మార్షల్ ఆర్ట్స్‌లో పాల్గొంటున్నట్లు పేర్కొన్నారు.

ఇందిరమ్మ గృహాలు ప్రారంభం

పాన్‌గల్, న్యూస్‌టుడే: ఇందిరమ్మ ఇళ్లు పేదల కళ్లల్లో ఆనందం నింపిందని జిల్లా గ్రంథాలయ సంస్థ ఛైర్మన్ గోవర్ధన్ సాగర్ అన్నారు. రాయినిపల్లిలో ఆదివారం సర్పంచి హేమాద్రితో కలిసి ఇందిరమ్మ ఇంటిని ప్రారంభించారు. మొదటి విడతలో మంజూరు చేసిన ఇళ్లు తుది దశలో ఉన్నాయని తెలిపారు. ఉపసర్పంచి ఎల్లస్వామి, జడ్పీటీసీ మాజీ సభ్యుడు రవికుమార్, పార్టీ మండలాధ్యక్షుడు వెంకటేశ్‌నాయుడు, భాస్కర్, రామాంజనేయులు, వాల్మీకి, ఉస్మాన్ పాల్గొన్నారు.

బీఎల్ఏలు అప్రమత్తంగా ఉండాలి


మాట్లాడుతున్న భాజపా జిల్లా అధ్యక్షుడు నారాయణ

వనపర్తి, న్యూస్‌టుడే : అర్హుల ఓట్లను తొలగించకుండా భాజపా కార్యకర్తలు, బీఎల్ఏలు అప్రమత్తంగా ఉండాలని ఆపార్టీ జిల్లా అధ్యక్షుడు నారాయణ అన్నారు. నాగవరం శివారులోని పార్టీ కార్యాలయంలో ఆదివారం బీఎల్ఏలు, ముఖ్య కార్యకర్తలకు కార్యశాల నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎస్ఐఆర్‌లో భాగంగా ఈఆర్వోల ద్వారా నోటీసులు అందుకున్న ఓటర్ల సరైన ధ్రువపత్రాలు సమర్పించి తుది ముసాయిదా జాబితాలో పేరు ఉండేలా చర్యలు తీసుకోవాలన్నారు. రెండు ఓట్లు, తప్పుడు సమాచారం ఆధారంగా నమోదైన ఓట్లను గుర్తించి అడ్డుకోవాలని సూచించారు. కార్యక్రమంలో కౌన్సిలర్ విజయ్‌సాగర్, నాయకులు వెంకట్‌రెడ్డి, బుడ్డన్న, విజయభాస్కర్, పెద్దిరాజు, శివారెడ్డి, బాబురావు, ప్రవీణ్, చిత్తారి ప్రభాకర్ తదితరులు పాల్గొన్నారు.

నేడు నిరాహార దీక్ష..

వనపర్తి, న్యూస్‌టుడే: రాష్ట్రంలో పెండింగ్‌లో ఉన్న ఉపకార వేతనాలు రూ.15 వేల కోట్లు మంజూరు చేయాలని కోరుతూ భాజపా, బీజేవైఎం ఆధ్వర్యంలో పట్టణంలోని రాజీవ్‌చౌక్‌లో సోమవారం నిరాహార దీక్ష చేస్తున్నట్లు భాజపా జిల్లా అధ్యక్షుడు నారాయణ తెలిపారు. పార్టీ కార్యకర్తలు, కళాశాలల విద్యార్థులు పాల్గొనాలని ఆయన కోరారు.

అయ్యప్ప ఆలయానికి విరాళం


కరుణాకర్‌రెడ్డిని సత్కరిస్తున్న అయ్యప్ప సేవా సమితి సభ్యులు

కొత్తకోట, న్యూస్‌టుడే : పట్టణంలో నిర్మిస్తున్న హరిహర పుత్ర అయ్యప్పస్వామి ఆలయానికి రూ.5 లక్షలు విలువ చేసే సిమెంట్ ఇచ్చేందుకు దాత రావుల కరుణాకర్‌రెడ్డి ముందుకు వచ్చారని ఆలయ కమిటీ అధ్యక్షుడు దూపం నాగరాజు తెలిపారు. ఆలయ నిర్మాణానికి 1,600 బస్తాల సిమెంట్ అవసరం ఉంటుందని కానాయపల్లికి చెందిన క్లాస్-1 కాంట్రాక్టర్ కరుణాకర్‌రెడ్డి దృష్టికి తీసుకెళ్లగా మొత్తం అందజేస్తానని హామీ ఇచ్చి అడ్వాన్సుగా కొంత నగదు ఇచ్చారని పేర్కొన్నారు. ఆలయ కమిటీ తరఫున సత్కరించారు. కార్యక్రమంలో అనిల్‌కుమార్, సత్యం సాగర్, భీమ కిశోర్, వేముల సుధాకర్‌రెడ్డి, ఉమామహేశ్వర్ సతీశ్ తదితరులు పాల్గొన్నారు.

వార్డు సభ్యుల సంఘం ఎన్నికల్లో భారాస విజయం


చిన్న ఆంజనేయులు గౌడ్‌ను అభినందిస్తున్న భారాస నాయకులు

ఖిల్లాగణపురం, న్యూస్‌టుడే: వార్డు సభ్యుల సంఘం మండల అధ్యక్షుడి ఎన్నికల్లో భారాసకు చెందిన సభ్యుడు విజయం సాధించారు. ఆదివారం స్థానిక బాదం సరోజాదేవి ఫంక్షన్ హాలులో జిల్లా అధ్యక్షుడు నక్క సుధాకర్ ఆధ్వర్యంలో నిర్వహించిన ఎన్నికల్లో 108 మంది వార్డు సభ్యులు ఓటు హక్కు వినియోగించుకున్నారు. భారాసకు చెందిన గోదా చిన్న ఆంజనేయులు గౌడ్‌కు 55 ఓట్లు, కాంగ్రెస్‌కు చెందిన చాగంటి మధుకు 53 ఓట్లు వచ్చాయి. రెండు ఓట్ల తేడా చిన్న ఆంజనేయులు గౌడ్ విజయం సాధించారు. జిల్లా అధ్యక్షుడు పత్రం అందజేశారు. మాజీ ఎంపీపీ కృష్ణా నాయక్, మండల భారాస అధ్యక్షుడు రాళ్ల కృష్ణయ్య, నాయకులు అభినందించారు.

వినాయక పూజ ప్రారంభం


పూజలో పాల్గొన్న పట్టణ ప్రజలు

వనపర్తి పట్టణం, న్యూస్‌టుడే : పట్టణంలోని మర్రికుంటలో 15 రోజుల పాటు నిర్వహించే అయుత చండీయాగంలో భాగంగా ఆదివారం వినాయక పూజతో యాగం ప్రారంభమైంది. కృష్ణ పీఠాధిపతి శ్రీ కృష్ణ జ్యోతి స్వరూపానంద స్వామి గణపతి పూజ ప్రారంభించారు. విఘ్నాలు తొలగి, 15 రోజుల యాగం కార్యక్రమాలు విజయవంతం కావాలని పూజలు చేశారు.

తాగునీరు కలుషితం



పట్టణంలోని పశు వైద్యశాల ఎదుట పైపులైన్ లీకేజీతో తాగునీరు వృథాగా వెళ్తూ కలుషితమవుతోంది. లీకేజీకి మరమ్మతులు చేయాలని ప్రజలు ఫిర్యాదు చేస్తున్నా పుర అధికారులు పనులు చేపట్టకుండా నిర్లక్ష్యం వహిస్తున్నారు. - **న్యూస్‌టుడే, అమరచింత**

యువత రాజకీయాల్లోకి రావాలి

వనపర్తి పట్టణం, న్యూస్‌టుడే: యువత రాజకీయాల్లోకి రావాలని బీసీ సంక్షేమ సంఘం జాతీయ కార్యనిర్వాహక అధ్యక్షుడు అరుణ్ పిలుపునిచ్చారు. స్థానిక ఆ సంఘం కార్యాలయంలో ముఖ్య నాయకుల సమావేశానికి ముఖ్యఅతిథిగా హాజరై మాట్లాడారు. రాబోయే రోజుల్లో బీసీలను చైతన్యం చేసి రాజ్యాధికారం సాధించేందుకు అడుగులు వేస్తున్నామన్నారు. అనంతరం ఆ సంఘం జిల్లా అధ్యక్షుడిగా రాములును ప్రకటించారు. సమావేశంలో సంఘం రాష్ట్ర అధ్యక్షుడు అరవింద్‌స్వామి, రాష్ట్ర కార్యదర్శి ముకుందనాయుడు, తదితరులు పాల్గొన్నారు.


జూనియర్స్ బాలికల్లో విజేతగా నిలిచిన నాగర్‌కర్నూల్ జిల్లా జట్టు క్రీడాకారిణులు..


జూనియర్స్ బాలురలో తృతీయ స్థానంలో నిలిచిన నాగర్‌కర్నూల్ జిల్లా జట్టు క్రీడాకారులు

అత్యాపత్య పోటీల్లో రాష్ట్రస్థాయి ప్రతిభ

నిర్మల్ అర్బన్, న్యూస్‌టుడే: నిర్మల్ జిల్లా కేంద్రంలోని ఎన్టీఆర్ మినీ స్టేడియంలో అత్యాపత్య అసోసియేషన్ ఆధ్వర్యంలో నిర్వహించిన రాష్ట్రస్థాయి జూనియర్స్ బాలబాలికల పోటీలు ఆదివారం ముగిశాయి. బాలుర విభాగంలో హైదరాబాద్ జిల్లా జట్టు విజేతగా నిలవగా, బాలికల్లో నాగర్‌కర్నూల్ జిల్లా జట్టు ప్రథమ స్థానం కైవసం చేసుకుంది. బాలురలో.. నాగర్‌కర్నూల్ తృతీయ స్థానంలో నిలిచింది. నిర్వాహకులు క్రీడాకారులకు మెడల్స్, ట్రోఫీలు అందజేశారు. కార్యక్రమానికి అతిథులుగా శేఖర్, లక్ష్మణ్, పోశెట్టి, బ్రహ్మయ్య, అసోసియేషన్ జిల్లా అధ్యక్ష, కార్యదర్శి వన్నెల భూమన్న, సంజీవ్ హాజరై బహుమతులు ప్రదానం చేశారు. ఎంపికైన క్రీడాకారులు అక్టోబరులో జమ్మూకశ్మీర్‌లో జరగనున్న జాతీయస్థాయి పోటీల్లో పాల్గొంటారని అసోసియేషన్ బాధ్యులు తెలిపారు. రాష్ట్ర పరిశీలకుడు పరమేశ్వర్, బాధ్యులు అజయ్, అమర్‌సింగ్, జిల్లాల అధ్యక్ష, కార్యదర్శులు, శిక్షకులు, వ్యాయామ ఉపాధ్యాయులు తదితరులు పాల్గొన్నారు.

రాహుల్ గాంధీ ప్రధాని కావాలని పాదయాత్ర


కొత్తకోటలో కాంగ్రెస్ కార్యకర్తల యాత్ర

కొత్తకోట, న్యూస్‌టుడే: కేంద్రంలో కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చి రాహుల్ గాంధీ ప్రధాని కావాలని ఆంధ్రప్రదేశ్‌కు చెందిన కాటూరి వెంకటేశ్వర్లు కన్యాకుమారి నుంచి చేపట్టిన పాదయాత్ర ఆదివారం కొత్తకోటకు చేరింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ భారతదేశాన్ని కాంగ్రెస్ పరిపాలించడం వల్లే సుస్థిరత సాధ్యమవుతుందని, ఇందుకు రాహుల్ గాంధీ నాయకత్వం అవసరమన్నారు. పాదయాత్రకు మండల, పట్టణ నాయకులు బీచుపల్లి యాదవ్, మేస్త్రీ శ్రీనివాసులు, పెంటన్న యాదవ్, బోయజ్, సుభాష్, బాదం వెంకటేశ్వర్లు, శంకర్, తయ్యబ్, హఫీజ్ పాల్గొన్నారు.

భాజపాలో చేరిన డీఎస్పీ అధ్యక్షుడు

గోపాల్‌పేట, న్యూస్‌టుడే : ఏదుల మండల ధర్మ సమాజ్ పార్టీ అధ్యక్షుడు దొడ్ల నాగరాజు ఆ పార్టీకి రాజీనామా చేసి ఆదివారం భాజపాలో చేరారు. పార్టీ రాష్ట్ర నాయకులు సబిరెడ్డి వెంకట్‌రెడ్డి, మణివర్ధన్ సాగర్ ఆధ్వర్యంలో మహబూబ్‌నగర్ ఎంపీ డీకే అరుణ సమక్షంలో గద్వాలలో చేరారు.

ఉపాధ్యాయుడికి సన్మానం


మురళీకృష్ణను సన్మానిస్తున్న మిత్రులు

పెబ్బేరు పట్టణం, న్యూస్‌టుడే : విదేశాల్లో అమలవుతున్న వినూత్న విద్యా విధానాలను పరిశీలించేందుకు రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా చేపట్టిన అంతర్జాతీయ అధ్యయన పర్యటనలో భాగంగా జపాన్ పర్యటనకు ఎంపికైన మండలంలోని యాపర్ల గ్రామ ప్రాథమిక పాఠశాల ఉపాధ్యాయుడు మురళీకృష్ణను మిత్రులు ఆదివారం సన్మానించారు. సెప్టెంబరు 5 నుంచి 12వ తేదీ వరకు జరిగే విదేశీ పర్యటనలో ఈయన పాల్గొననున్నారు. కార్యక్రమంలో బీసీ పొలిటికల్ జేఏసీ రాష్ట్ర కార్యదర్శి వెంకటన్న గౌడ్, శ్రీధర్‌రెడ్డి, రమేశ్, వెంకటేశ్, లక్ష్మయ్య, శ్రీనాథ్, తదితరులు పాల్గొన్నారు.

ఉత్సాహంగా ఎస్‌జీఎఫ్ పోటీలు


ఖోఖో ఆడుతున్న విద్యార్థినులు

అయిజ, న్యూస్‌టుడే: ఎస్‌జీఎఫ్ మండల స్థాయి ఆటల పోటీలు మేడికొండ ఉన్నత పాఠశాల మైదానంలో ఉత్సాహంగా సాగుతున్నాయి. ఆదివారం అండర్ 17 విభాగంలో ఖోఖో, కబడ్డీ, వాలీబాల్ పోటీలు నిర్వహించారు. పోటీలు పూర్తయ్యాక విజేతలను ప్రకటిస్తామని ఎస్‌జీఎఫ్ జిల్లా కార్యదర్శి జగదీశ్ తెలిపారు. హెచ్ఎం తిమ్మారెడ్డి, వ్యాయామ ఉపాధ్యాయులు, తదితరులు పాల్గొన్నారు.

సాగర్ పంప్‌హౌస్ సందర్శన

అమరచింత, న్యూస్‌టుడే : అమరచింత పెద్ద చెరువును చిన్నచింతకుంట మండలం ఉంద్యాల గ్రామం వద్ద ఉన్న కోయిల్ సాగర్ పంప్ హౌస్ నీటితో నింపాలని ఆయకట్టు రైతులు, ప్రజా సంఘాల నాయకులు జింక రవి, లక్ష్మీనారాయణ, రవికాంత్, రాజేశ్వర్ రెడ్డి, రంగన్న, కోదండరెడ్డి, కురుమన్న కోరారు. ఆదివారం కోయిల్ సాగర్ పంప్ హౌస్‌ను సందర్శించారు. మంత్రి వాకిటి శ్రీహరి, దేవరకద్ర ఎమ్మెల్యే జి.మధుసూదన్ రెడ్డితో చర్చించి నీటి విడుదలకు కృషి చేయాలని కోరారు.

1 నుంచి గెల్వలాంబమాత బ్రహ్మోత్సవాలు



వంగూరు, న్యూస్‌టుడే: మండల కేంద్రంలో గెల్వలాంబమాత బ్రహ్మోత్సవాలు సెప్టెంబరు 1-5 వరకు నిర్వహించనున్నట్లు ఆలయ ఛైర్మన్ నకినమోని శేఖర్ తెలిపారు. ఐదు రోజుల పాటు వైభవంగా జరిగే ఉత్సవాలకు అన్ని ఏర్పాట్లు పూర్తి చేశామని చెప్పారు. నాలుగు రోజుల పాటు కల్వకుర్తి, అచ్చంపేట తదితర డిపోల నుంచి ప్రత్యేక బస్సులు ఏర్పాటు చేసినట్లు తెలిపారు. భక్తులకు ఇబ్బందులు కలగకుండా తాగునీరు తదితర సదుపాయాలు కల్పించామన్నారు. ఉత్సవాల సందర్భంగా ఎలాంటి అవాంఛనీయ ఘటనలు జరగకుండా పోలీసుల బందోబస్తు ఏర్పాటు చేసినట్లు చెప్పారు.

కాంగ్రెస్ ఎస్సీ సెల్ కమిటీ ఏకగ్రీవం

పెబ్బేరు పట్టణం, న్యూస్‌టుడే : డీసీసీ అధ్యక్షుడు శివసేనారెడ్డి, ఎమ్మెల్యే మేఘారెడ్డి ఆదేశాల మేరకు పెబ్బేరు పట్టణ కాంగ్రెస్ ఎస్సీ సెల్ కమిటీని ఏకగ్రీవంగా ఎన్నుకున్నట్లు పట్టణ కాంగ్రెస్ అధ్యక్షుడు దయాకర్‌రెడ్డి ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. అధ్యక్షుడిగా గాడిమూడి పరశురాం, ఉపాధ్యక్షులుగా అంజి, రంగస్వామి, ప్రధాన కార్యదర్శిగా లక్ష్మీకాంత్, కోశాధికారిగా ఖాసీం, పది మంది కార్యదర్శులను ఎన్నుకున్నట్లు పేర్కొన్నారు.

పార్టీ సిద్ధాంతాలను ప్రజల్లోకి తీసుకెళ్లడమే లక్ష్యం

వనపర్తి న్యూటౌన్, న్యూస్‌టుడే : కాంగ్రెస్ పార్టీ సిద్ధాంతాలను ప్రజలకు వివరించి సేవా కార్యక్రమాలతో ముందుకు వెళ్లడమే లక్ష్యంగా పని చేస్తామని డీసీసీ ఉపాధ్యక్షుడు తిరుపతయ్య, సేవాదళ్ మహిళా విభాగం జిల్లా అధ్యక్షురాలు జయమ్మ అన్నారు. ఆనవాయితీ ప్రకారం ప్రతి నెల చివరి ఆదివారం సేవాదళ్ ఆధ్వర్యంలో నిర్వహించే కార్యక్రమంలో భాగంగా వారు జిల్లా పార్టీ కార్యాలయం ఎదుట జాతీయజెండా ఎగురవేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ సేవాదళ్ ఆధ్వర్యంలో నిర్వహించే సామాజిక సేవా కార్యక్రమాలను గ్రామ స్థాయిలలో విస్తరిస్తామన్నారు. కార్యక్రమంలో నాయకులు శ్రీనివాసులు, ఆంజనేయులు, నారాయణ తదితరులు పాల్గొన్నారు.

రాష్ట్ర కార్యదర్శిగా ఎన్నిక

అమరచింత, న్యూస్‌టుడే : తెలంగాణ బీడీ, సిగార్ వర్కర్స్ యూనియన్ రాష్ట్ర కార్యదర్శిగా అమరచింతకు చెందిన ఎస్.రాజు ఏకగ్రీవంగా ఎన్నుకున్నట్లు సీపీఎం జిల్లా కమిటీ సభ్యులు జీఎస్ గోపి, అజయ్ తెలిపారు. సిద్దిపేటలో ఆదివారం నిర్వహించిన రాష్ట్ర మహాసభల్లో ఎన్నుకున్నారన్నారు.

ఒరిగిన విద్యుత్తు స్తంభం



పట్టణంలోని పదో వార్డులో తహసీల్దార్, ఎంపీడీవో కార్యాలయాలకు వెళ్లే దారిలో విద్యుత్తు స్తంభం ఒరిగి ప్రమాదకరంగా నిలిచింది. గాలులు వీచినప్పుడు, వర్షాలు కురిసిన సమయంలో స్తంభం కూలి విద్యుత్తు తీగలు తెగి పడితే ప్రమాదం జరిగే అవకాశం ఉందని ప్రజలు భయాందోళనకు గురవుతున్నారు. సంబంధిత అధికారులు ఒరిగిన స్తంభాన్ని తొలగించి కొత్తది ఏర్పాటు చేయాలని వారు కోరుతున్నారు. - **న్యూస్‌టుడే, పెబ్బేరు పట్టణం**

ఇసుక వాహనాల స్వాధీనం..: మదనాపురం, న్యూస్‌టుడే : అక్రమంగా తరలిస్తున్న ఇసుక వాహనాలను ఆదివారం మదనాపురం పోలీసులు పట్టుకున్నారు. ఎస్సై జగదీశ్వర్ కథనం ప్రకారం.. మండలంలోని శంకరమ్మపేట సమీపంలోని ఊకచెట్టి వాగు నుంచి కొందరు ఆదివారం తెల్లవారుజామున అక్రమంగా ఇసుక తరలిస్తున్నారని సమాచారం అందింది. వెంటనే సిబ్బందితో చేరుకొని ఇసుక తీసుకెళ్తున్న లారీ, రెండు ట్రాక్టర్లను పోలీస్ ఠాణాకు తరలించామన్నారు. లారీ డ్రైవర్ శంషాబాద్ మండలంలోని జుక్కల్ గ్రామానికి చెందిన రాఘవేంద్ర, ట్రాక్టర్ డ్రైవర్లు శంకరమ్మపేట గ్రామానికి చెందిన భరత్, రామనాథపురం గ్రామానికి చెందిన జగదీశ్వర్‌పై కేసు నమోదు చేశామని ఎస్సై పేర్కొన్నారు.

పాత ఫోన్ల కొనుగోలు పేరుతో అనుమానితుల సంచారం..: పెబ్బేరు పట్టణం, న్యూస్‌టుడే : పాత ఫోన్లు కొనుగోలు చేస్తామంటూ తిరిగే వారి పట్ల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని మండలంలోని రంగాపురం గ్రామ వాట్సప్ గ్రూపులో యువకులు సందేశాలు పెట్టారు. ఆదివారం మధ్యాహ్నం గ్రామంలో ద్విచక్ర వాహనంపై అనుమానాస్పదంగా సంచరిస్తున్న ఉత్తర్‌ప్రదేశ్ రాష్ట్రానికి చెందిన వ్యక్తిని కొందరు గ్రామస్థులు ప్రశ్నించగా పొరపాటున వచ్చానని ఇకపై మీ గ్రామానికి రానని చెప్పడంతో వదిలేశారు. కొందరు అనుమానాస్పద వ్యక్తులు పగలు రెక్కీ నిర్వహించి, రాత్రి వేళ చోరీలకు పాల్పడుతుంటారని, అపరిచిత వ్యక్తులు కనిపిస్తే పోలీసులకు సమాచారం ఇవ్వాలని సందేశం పెట్టారు.

నిర్మించి.. వదిలేసి



మండలంలోని వెలగొండలో కొత్తగా నిర్మించిన గ్రామ పంచాయతీ భవనాన్ని ప్రారంభించకుండా వదిలేశారు. మూడేళ్ల కిందట రూ.20 లక్షలతో భవనాన్ని నిర్మించారు. నేటికీ ప్రారంభించకపోవడంతో ఆవరణలో పిచ్చి మొక్కలు పెరిగాయి. కిటికీల అద్దాలను గుర్తు తెలియని వ్యక్తులు ధ్వంసం చేశారు. త్వరలో భవనం ప్రారంభించేందుకు చర్యలు తీసుకుంటామని ఎంపీవో రామస్వామి తెలిపారు. - **న్యూస్‌టుడే, చిన్నంబావి**